క్లుప్తంగా

ఢిల్లీ నిరసనలో శ్రీరామవరం దాడి ప్రస్తావన



ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన కామిరెడ్డి నాని

దెందులూరు: ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నిరసన, ధర్నా కార్యక్రమంలో దెందులూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరిగిన దాడులు, హత్యలు, దౌర్జన్యాలను ధర్నాలో పాల్గొన్న ఇతర పార్టీల ప్రజాప్రతినిధులకు వివరించారు. దెందులూరు మండలం శ్రీరామవరంలో జరిగిన దాడులకు సంబంధించి ప్రతిపక్ష పార్టీల నాయకులకు వీడియో ప్రదర్శన ద్వారా చూపించారు. అధినేత వైఎస్ జగన్‌కు కామిరెడ్డి నాని పలు స్థానిక అంశాలు వివరించారు. శ్రీరామవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కామిరెడ్డి బాలు శ్రీరామవరంలో దాడి చిత్రాలను జంతర్‌మంతర్ వద్ద ప్రదర్శించి నిరసన తెలియజేశారు.

సీఎంఆర్ రైస్‌పై జేసీ ఆరా



దెందులూరు రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న జేసీ కలెక్టర్ ధాత్రీరెడ్డి

దెందులూరు: సీఎంఆర్ రైస్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)పై బుధవారం దెందులూరు రైస్‌మిల్లులో జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రీరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న వెంటనే ఆమె డీఎస్ఓ సత్యనారాయణరాజు, జిల్లా మేనేజర్ మంజుభార్గవితో కలిసి నేరుగా దెందులూరు రైస్‌మిల్లుకు విచ్చేశారు. 150 టన్నుల సీఎంఆర్ రైస్ బిల్లులు, డెలివరీ, రికార్డులు, మిషనరీ, మిల్లు ప్రాంగణం, విద్యుత్ సరఫరా సౌకర్యాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. బిల్లులు ఎందుకు పూర్తి చేయలేదని, మిల్లు యజమానిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట డిప్యూటీ కలెక్టర్ దేవకి, తహసీల్దార్ వీ.జితేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ ప్రమోద్‌కుమార్, వీఆర్వోలు శ్రీనివాస్, అనిరుధ్ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచి సలగాల గోపి

ఉంగుటూరు: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధి చెందాలని సర్పంచి సలగాల గోపి అన్నారు. బుధవారం కైకరం హైస్కూల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చెన్నుసత్యవేణి, సహ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాసరావు, పీవీ కన్నారావు, జి. గవరయ్య పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పెదపాడు: పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను పెదపాడు పోలీసులు అరెస్టు చేశారు. పెదపాడు పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దాసరిగూడెంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాటఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.9,800 స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

ఉంగుటూరు: కైకరం జిల్లాపరిషత్ హైస్కూల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో విద్యార్థులు పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. స్థానిక వనరులతో తయారుచేసిన బోధన అభ్యాసన సామగ్రిని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సలగాల గోపి, హెచ్ఎం గుళ్లప్రసాదరావు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

ఎంపీడీవో మృతికి సంతాపం

భీమడోలు: నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు ఆకాల మృతి పట్ల భీమడోలు మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఐకేపీ సిబ్బంది బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల బలన్మరణం చెందిన ఎం.వెంకటేశ్వరరావు ఫ్లెక్సీ వద్ద నల్లబ్యాడ్జీలను ధరించి ఎంపీడీవో టి.స్వర్ణలత, సచివాలయ గ్రామ కార్యదర్శులు, సిబ్బంది నివాళులర్పించారు. గ్రామ కార్యదర్శులు ముత్తయ్య, సూర్య, ధర్మా, మేడక హేమసుందర్ పాల్గొన్నారు.

ఆగిన వర్షం.. వరద నీటిలోనే వరి నాట్లు

- పొంగి ప్రవహిస్తున్న కాలువలు, డ్రెయిన్లు
- చాలా ప్రాంతాల్లో కుళ్లిన నాట్లు, నారు
- ఆందోళన రైతులు



ఉంగుటూరు: నారాయణపురంలో మునిగిన పంట పొలాలు పరిశీలిస్తున్న ఏవో బాలిన వెంకటేష్, సర్పంచి అలకానంద



గణపవరం: వాకపల్లిలో కుళ్లుతున్న వరిని చూపుతున్న సర్పంచ్ శ్రీనివాస్

ఉంగుటూరు: వారంరోజుల నుంచి మునిగిపోయి ఉన్న పంట పొలాలు ఇంకా తేరుకోలేదు. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి పెట్టి నాట్లు పూర్తిచేసిన తొలి దశలోనే తమ నాట్లు పాడైపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణపురం, తల్లాపురంలో మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, పరిశీలించారు. నారాయణపురం సర్పంచి దిడ్ల అలకానంద, తల్లాపురం సర్పంచి పసుపులేటి నర్సింహరావు ద్వారా రైతులు తమగోడును వివరించారు. వ్యవసాయ అధికారికి తెలియజేసి నష్టపోయిన రైతులను గుర్తించాలని న్యాయం చేయాలని రైతుల తరపున సర్పంచులు వ్యవసాయ అధికారులకు సూచించారు. కైకరం, నారాయణపురం, చేబ్రోలు, ఉంగుటూరు, వెల్లిమిల్లి, కాకర్లమూడి, వీఏపురం గ్రామ ఆయకట్టులో మునిగిన పొలాలు ఇంకా తేరుకోలేదు. ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏవో బాలిన వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో 2,168 ఎకరాల్లో నాట్లు వేశారని, అందులో 1,990 ఎకరాలు నీట మునిగాయన్నారు. 338 ఎకరాలు పంట పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. ముంపు నుంచి తేరుకున్న పంట పొలాలు మూనలు తిరిగి కోలుకునేందుకు పుంజుకునేందుకు ముంపునీటిని పొలాల్లోంచి బయటకు పంపించి యూరియా, పొటాష్ భూస్టర్ డోసుగా వేయాలని తెలిపారు. ముంపు నీరు దిగిన తరువాత నష్టం అంచనాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తామని ఏవో తెలిపారు. పంట దెబ్బతిన్న పొలాలకు తక్కువ వ్యవధిలో పంట చేతికందే విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు రైతులకు సహకరిస్తామని ఏవో తెలిపారు.



గణపవరం: కేశవరంలో పొలాలను ముంచెత్తిన ఎర్రకాలువ వరద నీరు



గణపవరం: ముంపు నీటిని తొలగించేందుకు ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేస్తున్న రైతు



కొండేపాడులో ముంపుబారిన పంచాయతీ రోడ్లు

ముంపు నీటిలోనే వరినాట్లు

గణపవరం: మండలంలో ఇటీవలి భారీ వర్షాలు, ఎర్ర కాలువకు వచ్చిన వరదల కారణంగా ముంపునకు గురైన పొలాలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. ఇప్పటికే ఐదు రోజుల నుంచి నీటిలో నానుతున్న వరినాట్లు, నారుమడులు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 12 వేల ఎకరాలకు 4వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తికాగా మొత్తం నాట్లు వేసిన పొలాలన్నీ ముంపులోనే ఉన్నాయి. 80శాతం నారుమడులు ముంపులోనే ఉన్నాయి. మండలంలోని ప్రధాన కాలువలన్నీ నిండుగా గట్ల సరాసరి ప్రహహిస్తూ, పొలాల్లోని ముంపునీరు బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. మండలంలోని పిప్పర, మోయ్యేరు, వెంకట్రాజపురం, కోమట్లపాలెం, ముప్పర్తిపాడు, కోమర్రు, డి.కుముదవల్లి, కేశవరం, కొండేపాడులో ఎర్రకాలువ కారణంగా ముంపుబారిన పడ్డాయి. ఎ.గోపవరం, వల్లూరు, వాకపల్లి, అర్ధవరం, జల్లికొమ్మర, వరదరాజపురం, గణపవరం, సరిపల్లెలో సైతం పొలాలన్నీ ముంపులోనే ఉన్నాయి. దీనితో రైతులు ముంపునీటిని బయటకు తరలించడానికి నానాపాట్లు పడుతున్నారు. పంట, మురుగు కాలువన్నీ నిండుకుండల్లా ప్రవహిస్తుండటంతో పొలాల్లోని నీరు బయటకు పోయే దారి కనిపించక, రైతులు ఇంజన్లు ఏర్పాటుచేసి ముంపునీటిని బయటకు తోడుకునే యత్నాలు ప్రారంభించారు. పిప్పరలోని ఆరోవార్డు, యనమదుర్ర కాలువ గట్టును చేర్చి ఉన్న ప్రాంతాల్లో రోడ్లపైకి మోకాలిలోతు నీరు చేరింది. కొండేపాడులో జగనన్న కాలనీలో రోడ్లు నీటమునిగాయి. బుధవారం వర్షం ఆగడంతో కాస్త ఎండకాసి ప్రజలకు ఊరటనిచ్చింది.

ఎర్ర కాలువ ఉధృతి తగ్గుముఖం



కొండేపాడు వద్ద ఎర్రకాలువ గట్టు వద్ద రాత్రి కాపలా కాస్తున్న గ్రామస్తుడు



కొండేపాడు వద్ద నీట మునిగిన లోలెవల్ వంతెన

గణపవరం: ఎర్ర కాలువ ఉగ్ర రూపానికి ముంపు అంచున ఉన్న కొండేపాడు గ్రామస్తులకు వారం రోజులుగా కంటిపై కునుకు కరువైంది. ఏ క్షణాన ఎర్ర కాలువ విరుచుకు పడుతుందోనని ప్రజలు క్షణ క్షణం భయం భయంగా గడిపారు. రెండు రోజుల క్రితం ఎర్ర కాలువకు ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు పోటెత్తడంతో గ్రామానికి వచ్చే ఎర్ర కాలువపై వంతెన నీటిలో మునిగిపోయి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నీటి మట్టం క్రమంగా పెరగడంతో వంతెన వద్ద నుంచి వరదనీరు గ్రామంలోకి ప్రవేశించడంతో గ్రామస్తులు యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలను అడ్డుకట్టి వరదనీరు గ్రామంలోకి రాకుండా నిలువరించారు. అప్పటికే గ్రామం చుట్టూ ఉన్న పంట పొలాలు మొత్తం నీట మునిగి సరస్సులా మారింది. గ్రామంలోని రోడ్లపైకి సైతం వరద నీరు ప్రవేశించింది. ఈ పరిస్థితిలో ఎర్ర కాలువ విరుచుకుపడితే గ్రామం ముంపుబారిన పడే ప్రమాదం ఉండటంతో గ్రామస్తులు రేయింబవళ్లు వంతుల వారీగా ఎర్ర కాలువ గట్లపై పహారా కాశారు. ఇసుక బస్తాలతో అడ్డుగోడ కట్టిన చోట రాత్రివేళల్లో గ్రామస్తులు కాపలా ఉంటున్నారు. బుధవారం ఎర్ర కాలువ కాస్త శాంతించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఒకరోజు వ్యవధిలోనే సుమారు మూడు అడుగుల నీటిమట్టం తగ్గడంతో ఇక ముంపు భయం నుంచి కాస్త ఉపశమనం కలిగిందని సర్పంచ్ శీతాలం పుల్లయ్యానాయుడు తెలిపారు. బుధవారం వర్షం కురవకుండా, ఎండకాయడంతో పరిస్థితి చక్కబడుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. వాతావరణం ఇలాగే ఉంటే మరో రెండు, మూడు రోజుల్లో ముంపు నీరు బయటకు పోతుందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దెందులూరు: కనకదుర్గమ్మకు ఆషాఢమాస సారె ఊరేగింపు కార్యక్రమాన్ని ఈ నెల 28న ఆదివారం ఉదయం 8 గంటల నుంచి దెందులూరులోని విష్ణు ఆలయం నుంచి ప్రారంభించనున్నట్టు మండల రామదండు కమిటీ నాయకులు సుగ్గిశెట్టి సూకరాజు అన్నారు. బుధవారం దెందులూరులో అమ్మవారి ఉత్సవానికి సంబంధించి గోడపత్రికను కమిటీ నాయకులు విడుదల చేశారు. సారె కార్యక్రమంలో ప్రజలందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరు కావాలని కోరారు.

యూడైస్‌ను వేగవంతం చేయాలి

దెందులూరు: యూడైస్ నమోదు ప్రక్రియను అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశాలను గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని దెందులూరు ఎంఈఓలు కేవీఎస్‌వీ ప్రసాద్, కే.అన్నమ్మ సూచించారు. బుధవారం దెందులూరు ఎంఆర్‌సీ సెంటరులో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో విజయవంతం చేయాలన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనాల సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనాలు సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు పోలీసులు, మత్స్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద బుధవారం కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని డ్రైవర్, వాహన యజమాని, చెరువు యజమానిపైన కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.

ఫోన్ వినియోగం జీవిత లక్ష్యానికి విఘాతం

దెందులూరు: ఫోన్ వినియోగం విద్యార్థుల జీవిత లక్ష్యానికి విఘాతంగా మారిందని సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో అసిస్టెంట్ ప్రొఫెషియల్ మరియల్ థెరేజ్, అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. బుధవారం ప్రిన్సిపల్ సిస్టర్ టీనా మరియా ఆధ్వర్యంలో ఫోన్ వినియోగం – జీవిత లక్ష్యం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించడంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో సిస్టర్ సువార్త, సిస్టర్ టీనామరియా, అసిస్టెంట్ ప్రొఫెషియల్ మరియల్ థెరేజ్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన

పెదపాడు: జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా ఫిజియోథెరఫీ, ఆడియోలజీ, సైకాలజీ సేవలు ఉచితంగా అందిస్తామని ఆ సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఏపూరులోని ఆదిత్య బధిరులు పాఠశాలలో 2016 దివ్యాంగుల హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య బదిరుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదరించాలి



కాశిపాడులో కుష్టు వ్యాధిగ్రస్తులకు దుస్తులు అందజేస్తున్న వైద్యాధికారి సంతోష్‌రెడ్డి

గణపవరం: కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదరించాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం గణపవరం మండలం కాశిపాడులో పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెన్మెత్స సుబ్బరాజు కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, దుస్తులు సమకూర్చగా వాటిని వైద్యాధికారి సంతోష్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, తెర్లి కృష్ణారావు, వేగేశ్న గాంధీరాజు, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, హైస్కూలు ఉపాధ్యాయులు నిమ్మల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు



గుండుగొలనులో డ్రెయిన్ల పూడిక తీతను పరిశీలిస్తున్న ఏలూరు డీఎల్‌పీవో కేపీ చంద్రశేఖర్, ఈవోఆర్డీ సుందరి



భీమడోలులో నీటి పరీక్షలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కేపీ చంద్రశేఖర్, పంచాయతీ సర్పంచ్ పాము సునీత

భీమడోలు: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి కేపీ చంద్రశేఖర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలు, ఇతర సమస్యలపై భీమడోలు ఈవోఆర్డీ ఏ.సుందరితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలు, మంచినీటి సమస్యలపై ఆయన పరిశీలించారు. గుండుగొలనులో డ్రెయిన్ల పూడిక తీసే కార్యక్రమాన్ని, శానిటేషన్ కార్యక్రమాలను పరిశీలించి సంబంధిత గ్రామకార్యదర్శి మురళీకృష్ణకు పలు సూచనలందించారు. తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాకాలంలో అపరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, పంచాయతీ పరిధిలోని మురుగు డ్రెయిన్లు, రోడ్లపై నిల్వ నీటిని బయటకు పంపించేందుకు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భీమడోలులో మంచినీటి ఫిల్టర్ బెడ్లను ఆయన పరిశీలించి, నీటి పరీక్షలు చేయించారు. ప్రతి రోజు గ్రామాల్లో చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. ఎప్పటికప్పుడు మురుగు డ్రెయిన్లలో పూడిక తీయించాలని బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీత, సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అయ్యంకి



భీమడోలులో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమడోలు: గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య సేవలు స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయ్యంకి 135వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రచయిత గుర్రం జాషువ, సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ గ్రంథాలయోద్యమంలో అయ్యంకి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. గ్రంథాలయాల ద్వారా ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని పొంది తమ జీవితాల్లో వెలుగులను నింపుకున్నారన్నారు. ఓ వ్యక్తి శక్తిగా ఎదగాలంటే పుస్తక పఠనం ద్వారా సాధ్యమన్నారు. ఆ పుస్తకాలను ప్రతి ఒక్కరి చెంతకు తీసుకుని వచ్చిన మహనీయుడన్నారు. అనంతరం గుర్రం జాషువ, సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతిని పురస్కరించుకుని వారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ




గుండుగొలనులో ఇంటర్ విద్యార్థినులకు పుస్తకాలను అందిస్తున్న హెచ్ఎం జీకేడీ సునీత

భీమడోలు: నూతన విద్యా విధానంలో ఇంటర్ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడం ద్వారా పేద విద్యార్థులకు మేలు కలుగుతుందని గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం గారపాటి కనక దుర్గాసునీత అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్లస్ టూ విద్య అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో బాలికలకు రెండేళ్ల ఇంటర్ విద్య అందుబాటులోకి వచ్చింది. పాఠశాలలో జూనియర్, సీనియర్ ఇంటర్ తరగతి క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో ఇంటర్ చదువుతున్న 24 మంది బాలికలకు డిక్షనరీలు, రాత పుస్తకాలను అందించారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు నిర్వహిస్తున్నామని అధ్యాపకులు తెలిపారు. దూర ప్రాంతాలకు విద్యార్థులను పంపించి తల్లిదండ్రులు ఆర్థికంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీడీ వి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిలాఫలకం తొలగింపు



రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేసిన సీహెచ్‌సీ



సీహెచ్‌సీలో శిలాఫలకాన్ని తొలగించిన దృశ్యం

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.2.50 కోట్లు విడుదల చేసి దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అభివృద్ధి చేసి ఆధునీకరించారు. సీహెచ్‌సీలో వైద్య సేవలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. నియోజకవర్గ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా నేడు విశిష్ట సేవలు అందిస్తోంది. అందుకు కారకులైన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఇతర ప్రజాప్రతినిధుల పేర్లతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని తొలగించారు. శిలాఫలకాన్ని తొలగించడాన్ని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



సీతంపేట ఎంపీపీ స్కూల్లో విద్యార్థులతో క్రికెట్ ఆడుతున్న ఉపాధ్యాయులు



పోతునూరు పాఠశాలల్లో యోగాసనాలు వేసిన విద్యార్థులు

దెందులూరు: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షా సప్తాహ్ పథకంలో భాగంగా బుధవారం మండలంలో అన్ని పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సీతంపేట ఎంపీపీ స్కూల్లో హెచ్ఎం జీ.సునీత, ఉపాధ్యాయులు జి.రాజ్యలక్ష్మి, తోట ఎడ్వర్డ్ విద్యార్థులతో క్రికెట్ ఆడారు. పోతునూరు పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ ఎం. కృష్ణారావు విద్యార్థులతో యోగా చేయించారు.

ఆంజనేయులు మృతికి సంతాపం



బూరుగుపల్లి ఆంజనేయులు (ఫైలు)

ఉంగుటూరు: చేబ్రోలుకు చెందిన సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త బూరుగుపల్లి ఆంజనేయులు(56) బుధవారం వేకువజాము గుండెపోటుతో మృతి చెందారు. మానవత సంస్థ ఉంగుటూరు శాఖకు మొదటి ఫ్రీజరును ఆంజనేయులు అందజేశారు. చేబ్రోలు రైల్వేగేటు పక్కనున్న అండర్ పాస్‌కు సిమెంట్ రోడ్డును ఆయన సొంత నిధులతో నిర్మించారు. మానవత వ్యవస్థాపకుడు ఎస్ రామచంద్రరెడ్డి ఫోనులో ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే గన్ని ఆంజనేయులు, జిల్లా ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సాగిరాజు జానకి రామరాజు మానవత, రీజనల్ చైర్మన్ పుప్పాల గోపి, మండల అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు, ఉపాధ్యక్షుడు కోనే వీరవెంకట సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.